
ఆంధ్రజ్యోతి



నచ్చేవారు వచ్చేవరకు రద్దే!

- ఇరిగేషన్ పనుల్లో ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం
- గుడివాడ, పామర్రు ఇరిగేషన్, డ్రెయినేజీ టెండర్లు రద్దు
- ఎమ్మెల్యేల జోక్యంలేని చోట్ల పనులు షురూ
- కొన్ని నియోజకవర్గాల్లో 39 శాతం లెస్‌కు టెండర్లు

4లో



బాపులపాడు మండలం అంపాపురంలో సిద్ధమవుతున్న బరి

హైటెక్ బరులు

జిల్లాలో కోడి పందేల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు

- అంపాపురంలో 12 ఎకరాల్లో భారీ సెట్టింగ్
- ఎల్ఈడీ తెరలు, విద్యుత్ దీపాలు, వీవీపీ గ్యాలరీలు
- రికార్డు స్థాయిలో పందేల నిర్వహణకు ప్రణాళిక
- హోటళ్లలో రూమ్‌లు బుక్ చేసుకున్న పందెం రాయుళ్లు
- చేతులు మారనున్న కోట్ల రూపాయలు

6లో

అయ్యో అమ్మా..

ఎనికేపాడు వద్ద రోడ్డు ప్రమాదం

ఐదు నెలల గర్భిణీ దుర్మరణం

4లో



యర్రంశెట్టి సుష్మ (ఫైల్)

విజ్ఞాన వెలుగు

- ఉత్సాహంగా పుస్తక మహోత్సవం

4లో

రెండు రోజుల పోలీస్ కస్టడీకి నిందితులు

- పేర్ని బియ్యం కేసులో న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ

మచిలీపట్నం, జనవరి9(ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి పేర్నినాని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులను రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గోడౌన్ మేనేజర్ మానస్ తేజ, మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, లారీడ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించనున్నారు. ఈ నెల 7న ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ముగ్గురు నిందితులను పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై విచారణను ఈ నెల 16వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

రీ సర్వేలో తప్పుల్లేకుండా చూడండి

- కలెక్టర్ బాలాజీ

4లో

ఇసుక కార్మికులపై కేసు నమోదు

- నార్తువల్లూరు క్వారీలో తవ్వకాలు నిలిపివేత

4లో

పోర్టు పనుల్లో జాప్యమేల!

- ఏపీ మేరిటైమ్ బోర్డు సీఈవో



పోరాట యోధుడు చలం



నవలలు ఆవిష్కరిస్తున్న రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మి

విజయవాడ కల్చరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పోరాట యోధుడు చలం సమాజం అరసికత మీద అనుక్షణం పోరాడాడని ప్రముఖ రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మి అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం గుడిపాటి వెంకట చలం రచించిన అమీనా, వివాహం, అరుణ, దైవమిచ్చిన భార్య నవలలను ఆమె ఆవిష్కరించారు. ఆయన మాటలు కుంచెం, కత్తి, తుఫానులాంటి మాటలతో సమాజాన్ని మార్చేందుకు ప్రయత్నించాడని చెప్పారు. ఆయన రచనలు చదువుతుంటే శరీరంలోకి కొత్త నెత్తురు ఎక్కుతున్నట్లు ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన వావిలాల సుబ్బారావు మాట్లాడుతూ సమాజానికి చలం రచనలు ఎప్పటికీ అవసరమేనన్నారు. చలం జీవితంలో ఒక రకమైన సమస్యకో, ఒక రంగానికో పరిమితమైనవాడు కాదన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ చలం రచనలను అధ్యయనం చేయడం, వాటి గురించి మాట్లాడుకోవడం ఒక ఉత్తేజకరమైన కార్యక్రమమన్నారు. రచయిత్రి గోటేటి లలితాశేఖర్ సభలో పాల్గొన్నారు.

గ్రంథాలయాల పునరుజ్జీవనానికి ఉద్యమించాలి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల పునరుజ్జీవనానికి పౌరులు ఉద్యమించాలని, దీనికోసం పౌరుల ఉద్యమించాలని, తెలుగువారిలో భాషా సంస్కృతి, చైతన్యాన్ని పునరుజ్జీవింపజేయడానికి గ్రంథాలయ ఉద్యమం తప్పనిసరని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో గురువారం రామోజీరావు సాహితీ వేదికపై గ్రంథాలయ పునర్వికాస సదస్సు నిర్వహించారు. తెలుగు జాతి చైతన్యానికి, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటానికి గ్రంథాలయ ఉద్యమమే కారణమని చెప్పారు. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందింపజేసే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. పుస్తకాలు చదివించడం విద్యా విధానంలో భాగం కావాలని ఆకాంక్షించారు. నేటితరం పిల్లలు తెలుగు చదవలేకపోవడం విషాదకరమన్నారు. దేవాలయాల వ్యవస్థకు, గ్రంథాలయ వ్యవస్థకు ప్రభుత్వాలు న్యాయం చేయలేకపోతున్నాయని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాలకు స్వయం సమృద్ధి కల్పించేందుకు చదువరులు ఉద్యమించాలని, ప్రభుత్వాలను నిలదీయాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త రాష్ట్రంలో జాతికి గర్వకారణమయ్యే రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సభాధ్యక్షుడు ఎస్.వెంకటనారాయణ మాట్లాడుతూ, గ్రంథాలయ వ్యవస్థ నిర్వీర్యం అయిపోవడం సమాజానికి మంచిది కాదన్నారు. సాహిత్య అకాడమి సభ్యుడు ఎమెస్కో విజయకుమార్ మాట్లాడుతూ, సమాజానికి గ్రంథాలయాల అవసరముందని ఆలోచనాపరులంతా కలసి నిరూపించాల్సిన తరుణం ఆసన్నమయ్యిందన్నారు. సమాజంలో పుస్తక పాఠకులున్నారని నిరూపిస్తేనే రాజకీయ వ్యవస్థ గ్రంథాలయాల పునర్వికాసానికి మద్దతునిస్తుందన్నారు. సాంప్రదాయిక ప్రచురణరంగానికి రచయితల మీద పట్టు తగ్గిపోయిందన్నారు. దీనివల్ల రచయితల్లో ఐక్యమత్యం తగ్గిందన్నారు. వీటన్నిటి వల్ల ప్రభుత్వాల మీద వత్తిడి చేసే వ్యవస్థలు ఏర్పడలేదన్నారు. వివిధ రంగాలతో తెలుగు ప్రచురణరంగానికి అనుబంధం తగ్గిపోతోందన్నారు. చదువరులంతా కలిసి వ్యవస్థల మీద ఒత్తిడి తెచ్చేలా ప్రజాగళాన్ని చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. తప్పుల్లేకుండా తెలుగు రాయగల సమూహాలను వృద్ధి చేయాలని ఆకాంక్షించారు. వికీపీడియా కార్యకర్త రెహ్మాన్ మాట్లాడుతూ, గ్రంథాలయాలను ఎలా వినియోగించుకోవాలన్న అవగాహన నేటితరానికి కరువయ్యిందన్నారు. అందువల్లే అవి క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయన్నారు. గ్రంథాలయాలను సాంస్కృతిక కేంద్రాలుగా, సామాజిక కార్యక్రమాలకు కూడళ్లుగా మార్చాలన్నారు. ఆధునిక పరిస్థితులకు తగినట్టు గ్రంథాలయాల చట్టానికి మార్పులు చేయాలన్నారు. సాంకేతిక సౌకర్యాలను వాడి అంతర్జాలంలోని సమాచారం అందరికీ అందుబాటులోకి తేవాలన్నారు. క్రియేటివ్ కామన్స్ శ్రీపతి మాట్లాడుతూ, పుస్తకాలకు సంబంధించి కాపీరైట్స్‌ను సరళీకరించాలని ఆకాంక్షించారు. మనసు ఫౌండేషన్ బాధ్యుడు మన్నెం రాయుడు మాట్లాడుతూ, పఠనాసక్తి తగ్గిపోవడం గ్రంథాలయాల సమస్యకు మూలకారణమన్నారు. వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో మౌలిక వసతి, సౌకర్యాల లేమి పాఠకులు వారికి దూరం అయ్యేలా చేస్తోందన్నారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును పూర్తిగా గ్రంథాలయాల అభివృద్ధికే వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాశక్తి లక్ష్మయ్య, విశాలాంధ్ర మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విశ్వం అధ్యయనం ఆసక్తికరం

విజయవాడ కల్చరల్ : విశ్వం అధ్యయనం ఆసక్తికరమని, భూమిచుట్టూ ఆవరించుకుని దానికి ఆలంబనగా నిలిచిన అంతరిక్షాన్ని, దానితో కూడిన విశ్వాన్ని అధ్యయనం చేయడం, ఆదిమానవుడి నుంచి నేటి వరకూ చాలా ఆసక్తికరమైన విషయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవం గురువారం గంటా సత్యకుమార్ రచించిన 'విశ్వం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. విశ్వం, అంతరిక్షంపై నేటి తరానికి దగ్గర చేయడానికి, మూఢనమ్మకాలను దూరం చేయడానికి ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. సృజనాత్మకత, సాంస్కృతిక సమితి అధ్యక్షురాలు తేజస్విని మాట్లాడుతూ విద్యార్థులకు ఖగోళం, విశ్వంపై ఆసక్తి కలిగించి సైంటిస్టులయ్యేలా చేస్తుందన్నారు. విశ్రాంత అధ్యాపకుడు గుమ్మా సాంబశివరావు పుస్తకాన్ని పరిచయం చేస్తూ విశాల విశ్వానికి సంబంధించిన ఖగోళ వివరాలను సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా ఈ రచన సాగిందన్నారు. తెలుగు అధ్యాపకుడు కప్పగంతు రామకృష్ణ, గోళ్ల నారాయణరావు, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు, విశ్రాంత అధ్యాపకుడు గంటా రామప్రసాద్ పాల్గొన్నారు.

3డీ పుస్తకాలొచ్చేశాయ్..



విజయవాడ సిటీలైఫ్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : 3డీ.. ఎక్కువగా ఇంగ్లీష్ సినిమాల్లో వినిపించే పదం. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించడానికి థియేటర్లలో ప్రత్యేకంగా 3డీ కళ్లజోళ్లు ఇస్తారు. తెరపై కనిపించే బొమ్మ ప్రేక్షకుల కళ్లెదెటే కదులుతున్న అనుభూతి కలుగుతుంది. ఇలాంటి చిత్రాలను చిన్నారులు బాగా ఇష్టపడతారు. సినిమాల్లో 3డీ అనుభూతిని ఇప్పుడు పుస్తకాల్లో చూపిస్తున్నారు ప్రచురణకర్తలు. పిల్లల కోసం ప్రత్యేకంగా 3డీ పుస్తకాలు ముద్రిస్తున్నారు. పుస్తకాలను చూసేందుకు వాటితోపాటు ఒక కళ్లజోడును ఇస్తున్నారు. ఈ 3డీ పుస్తకాలు స్టాల్ నంబర్ 36లో అందుబాటులో ఉన్నాయి. ది యానిమల్ కింగ్‌డమ్, ది వండర్స్ ఆఫ్ ది సీ వరల్డ్ పుస్తకాలు 3డీలో ముద్రించారు. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.125గా నిర్ణయించారు.

చిన్నారుల కోసం 'చిన్న' పుస్తకాలు..



వయస్సుతో సంబంధం లేకుండా పుస్తకాల మోతను ఇస్తోంది ప్రస్తుత విద్యా విధానం. రెండో తరగతి, మూడో తరగతి చదివే విద్యార్థులు పెద్ద పెద్ద బ్యాగ్‌లతో పుస్తకాలను మోయాల్సిన పరిస్థితి. అటువంటి వారి కోసం తేలిగ్గా మోయ గలిగే చిన్న పుస్తకాలు పుస్తక మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టాల్ నంబర్ 36లో ఉన్న ముంబైకి చెందిన నవనీత ఎడ్యుకేషనల్ లిమిటెడ్‌లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో పుస్తకం ఖరీదు రూ.60లుగా నిర్ణయించారు. నర్సరీలో ఇంగ్లీష్ పద్యాలు, కలర్స్, షేప్స్, వెహికల్స్, వైల్డ్ యానిమల్స్, వెజిటబుల్స్, అపోజిటింగ్ పుస్తకాలను చిన్నారులకు తగ్గట్టుగా రూపొందించారు. దీనితోపాటు బాల గణేష్ అండ్ హిజ్ ఫ్రెండ్స్ వంటి బుల్లి పుస్తకాలను చిన్నారులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

'అత్తగారి కథలు'



అత్తాకోడళ్ల మధ్య అనుబంధాలు ఒక రకం. గొడవలు, పంతాలు మరో రకం. ఈ రెండు వేర్వేరు అంశాలకు సంబంధించి కథా రూపాన్ని ఇచ్చారు సినీనటి భానుమతీ రామకృష్ణ. వివిధ చిత్రాల్లో అత్తగా అనేక పాత్రలు పోషించిన ఆమె 'అత్తగారి కథలు' పేరుతో పుస్తకాన్ని రాశారు. అత్తగారు ఆవకాయ, అత్తగారు ఆవు నంబరు 23, అత్త-తోడుకోడలీయం వంటి కథలకు ఆమె జీవం పోశారు. ఈ పుస్తకానికి రాష్ట్ర సాహిత్య అకాడమి పురస్కారం దక్కింది. ఈ పుస్తకాలు స్టాల్ నంబరు 208లో ఉన్న అన్వేక్షికి పబ్లిషర్స్‌లో అందుబాటులో ఉన్నాయి.

వాడుక భాషలో రామాయణ, భాగవతాలు

రామాయణం, భాగవతం, మహాభారతం ఈ ఇతిహాసాలన్నీ పద్యాలతో కూడి తెలుగులో ఉంటాయి. నేటి చదువుల్లో ఉన్న వారికి గ్రాంథికం భాష చదవడం కాస్త కష్టంగానే ఉంటుంది. నాయకని కృష్ణమూర్తి వాటికి వాడుక భాషలో అక్షరరూపాన్నిచ్చారు. ఈ పుస్తకాలు స్టాల్ నంబర్ 31లో ఉన్న విజయవాణి ప్రింటర్స్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటితోపాటు మధురాంతకం నరేంద్ర రాసిన 'నిశ్శబ్దపు చప్పుడు', కార్టూనిస్టు జయదేవ్ రాసిన 'గ్లాచ్యూమీచ్యూ -1, 2', 'జయదేవ్ జోక్స్', వేమూరి సత్యనారాయణ రాసిన 'ఎనభైలో ఇరవై' కథల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా చూడండి

» రెవెన్యూ అధికారుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 20 నుంచి భూమి రీ సర్వే ప్రారంభమవుతుందని, ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. జిల్లా సర్వే విభాగం ఆధ్వర్యంలో కృష్ణా వర్సిటీ ఆడిటోరియంలో గురువారం ఉయ్యూరు, మచిలీపట్నం డివిజన్ రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు, వీఆర్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, వందేళ్ల తర్వాత జరుగుతున్న భూమి రీసర్వేను పూర్తిస్థాయి వివరాలతో నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా రీ సర్వే చేయాలన్నారు. తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, భూ రీ సర్వే ప్రక్రియలో సమస్యలున్న భూముల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, అనుభవదారులు, హక్కుదారులు, ప్రైవేట్, ప్రభుత్వ భూములు, భూసేకరణలో ఉన్న భూముల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. భూ యజమానులు స్థానికంగా లేకుంటే వారికి సమాచారం తెలియజేయాలని, వారిని సర్వే జరిగే సమయంలో అక్కడ ఉండేలా చూడాలన్నారు. విదేశాల్లో ఉన్నవారికి సమాచారం తెలియజేసి వారు సూచించిన వ్యక్తుల సమక్షంలో రీసర్వేను చేయాలన్నారు. రీ సర్వే ప్రారంభించే ముందు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ముందస్తుగా రైతులకు సమాచారం తెలియజేయాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఉయ్యూరు, మచిలీపట్నం ఆర్డీవోలు హేలాషారోన్, కె.స్వాతి, తహసీల్దార్‌లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోర్టు పనుల్లో జాప్యమేల!

» ఏపీ మేరిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య

మచిలీపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టుపనులు వేగవంతం చేయాలని, సరైన ప్రణాళికలు, యంత్రాలు లేకుండా ఎంతకాలంపాటు ఈ పనులను సాగదీస్తారని ఏపీ మేరిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్‌ఆదిత్య అసహనం వ్యక్తం చేశారు. పోర్టు పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెర్తులు, బ్రేక్‌వాటర్, పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతంలో డ్రెడ్జింగ్, అంతర్గత రహదారులు, వాటికి సంబంధించిన ప్రణాళికలు, నమూనాలు, పనులు చేసేందుకు అవసరమైన యంత్రసామగ్రి ఎంతమేర ఉంది తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. యంత్రాలు, వాటి సామర్థ్యం అడిగి తెలుసుకున్నారు. పనులకు సరిపడా యంత్రాలు లేకుండా ఎంతకాలం సాగదీస్తారని ఆయన మేరిటైమ్‌బోర్డు అధికారులను నిలదీశారు. పోర్టువద్ద అంతర్గత రహదారులకు సంబంధించి నమూనాలు ఇంకా సిద్ధం చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణంలో డ్రెడ్జింగ్ ప్రక్రియ కీలకమని, డ్రెడ్జర్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుంటే ఎలాగని ఆయన అన్నారు. జాతీయరహదారి 216-ఎ నుంచి పోర్టువరకు రోడ్‌కం రైలు మార్గాలకు సంబంధించి భూసేకరణలో ఉన్న ఇబ్బందులు ఎప్పటిలోగా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. బిల్లులు చేసి పంపుతున్నా.. ఇక్కడ అంతమేర పనులు జరగలేదని తన పరిశీలనలో స్పష్టమవుతోందన్నారు. అధికారులు బిల్లులుచేసే అంశంలో ఉన్న శ్రద్ధ పనులు చేయించడంలో లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే అధికారులందరికీ బదిలీలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 11న ఏపీ మేరిటైమ్, రైట్స్‌సంస్థ, పోర్టుపనులు చేస్తున్న మెఘా కాంట్రాక్టుసంస్థ అధికారులతో అత్యున్నత స్థాయి సమావేశం ఉంటుందని, అప్పటికి పోర్టుపనులకు సంబంధించి పూర్తిస్థాయి వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని ఆయన ఏపీ మేరిటైమ్ బోర్డు ఈఈ పల్లారావును ఆదేశించారు. అధికారుల పనితీరుపై పలు ఆరోపణలు వస్తున్నాయని, వారు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

నచ్చేవారు వచ్చేవరకు..

రద్దే!

» ఇరిగేషన్ పనుల్లో ఎమ్మెల్యేల ఇష్టారాజ్యం
» గుడివాడ, పామర్రు ఇరిగేషన్, డ్రెయినేజీ టెండర్లు రద్దు
» ఎమ్మెల్యేల జోక్యంలేని చోట్ల పనులు షురూ
» కొన్ని నియోజకవర్గాల్లో 39 శాతం లెస్‌కు టెండర్లు

నీటిపారుదల శాఖలో టెండర్లంటే కాసుల వర్షమే. కాల్వల్లో పూడికతీత, వాటి నిర్వహణ వంటి పనుల్లో భారీగా డబ్బు మిగులుతుండటంతో టెండర్లను దక్కించుకునేందుకు విపరీతమైన పోటీ ఏర్పడింది. అయితే, తమకు కమీషన్లు ఇచ్చేవారికి.. తమకు అనుకూలురుకు ఈ టెండర్లను కట్టబెట్టేందుకు ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో చేసేది లేక అధికారులు ప్రతిసారీ టెండర్లను రద్దు చేసేస్తున్నారు. వైసీపీ హయాంలోని ఈ జాడ్యాన్ని కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులూ కొనసాగిస్తుండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



నందివాడ దగ్గర నీటిపారుదల శాఖ కాల్వ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గతేడాది నవంబరులో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు సెక్షన్లలో రూ.5.74 కోట్లతో 29 పనులకు టెండర్లను పిలిచారు. గత ఏడాది నవంబరు 11న పిలిచి 25న తెరిచేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో నవంబరు 25న కాకుండా డిసెంబరు 2వ తేదీ వరకు టెండరు దాఖలకు సమయాన్ని పొడిగించారు. తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు రావడంతో డిసెంబరు 7న వాటిని రద్దు చేశారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో రూ.3.84 కోట్లతో 26 పనులు చేపట్టేందుకు నవంబరు 11న టెండర్లు పిలిచారు. వీటిని డిసెంబరు 9న రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ టెండర్లు పిలిచారు. డిసెంబరు 30న వీటిని తెరవాల్సి ఉంది. కానీ, కొన్ని నియోజకవర్గాల పరిధిలోని టెండర్లను మాత్రమే ఓకే చేసి.. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని టెండర్లను మళ్లీ రద్దు చేస్తున్నట్లు గురువారం అధికారులు ప్రకటించారు.

అయినవారి కోసమే..

నీటిపారుదల శాఖలో పనుల్లో 'గిట్టుబాటు' ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ఈ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున పోటీ పడుతుంటారు. అదే స్థాయిలో లెస్‌కూ టెండర్లు వేస్తుంటారు. ఉదాహరణకు.. వెంట్రప్రగడ సెక్షన్‌లో దోసపాడు చానెల్‌ను సుమారు 4.5 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేసి నిర్వహించేందుకు రూ.19.18 లక్షలతో టెండర్ పిలవగా, 32 శాతం లెస్‌కు రూ.13.47 లక్షలకే పనులు చేస్తామని కాంట్రాక్టర్ టెండర్ వేశారు. అలాగే, ఆత్కూరు యూటీ మీడియం డ్రెయిన్ మరమ్మతులు, నిర్వహణకు రూ.25.49 లక్షలతో పనులు పిలవగా, సుమారు 39 శాతం లెస్‌కు రూ.15.59 లక్షలకే పనులు చేస్తామని టెండర్ వేశారు. మిగిలిన పనులకు భారీస్థాయిలో లెస్‌కు టెండర్లు పడ్డాయి. కైకలూరు, గన్నవరం, అవనిగడ్డ వంటి నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల నుంచి ఎలాంటి జోక్యం లేకపోవడంతో టెండర్లను ఓపెన్ చేసి పనులు అప్పగించేశారు.

ఆ మూడు నియోజకవర్గాల్లో..

గుడివాడ, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల అనుచరుల జోక్యం మితిమీరడంతో అధికారులు పదేపదే టెండర్లను రద్దు చేసే పరిస్థితి ఏర్పడింది. పెనమలూరు నియోజకవర్గానికి రెండో విడతలో టెండర్లు ఓకే చేశారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల టెండర్లు మాత్రం ఓ కొలిక్కి రావడం లేదు. తమకు కావాల్సిన వారికి కట్టబెట్టేందుకో, కమీషన్ల కోసమే ఈ టెండర్లను స్థానిక నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి పదేపదే రద్దు చేయిస్తున్నారు. వారి ప్రయత్నాలు విఫలం కావడంతో అధికారులను తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు మారుమాట్లాడకుండా వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఈ రద్దు బాగోతంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టి సారించాలని అధికారులు కోరుతున్నారు.

15 నిమిషాలు ఆలస్యమైందని..

» ప్రయాణికుడిని అనుమతించని ఎయిరిండియా సిబ్బంది
» చార్జీలు తిరిగి చెల్లించిన విమానాశ్రయ అధికారులు

గన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయంలో ఎయిరిండియా సిబ్బంది, ప్రయాణికుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అమెరికా వెళ్లేందుకు విద్యార్థి విమానాశ్రయానికి గురువారం ఉదయం 7.45 గంటలకు వచ్చాడు. అయితే విమానం బయలుదేరేందుకు 45 నిమిషాలు ముందు వచ్చిన అతడి లగేజ్‌ను విమానంలోకి పంపించేందుకు ఎయిరిండియా సిబ్బంది నిరాకరించారు. గంటముందు రావాల్సి ఉండగా 45 నిమిషాల ముందు రావటంతో ఎయిరిండియా సిబ్బంది టైమ్ అయిపోయిందని చెప్పారు. దీంతో ప్రయాణికుడికి, ఎయిరిండియా సిబ్బంది వద్ద వాగ్వివాదం చోటుచేసుకుంది. తాను ముందుగానే విమానాశ్రయం లోపలికి వచ్చానని కావాలనే డిలే చేసి విమానం వెళ్లిపోయిందని సిబ్బంది చెప్పటంతో విద్యార్థి ఆందోళన చెందాడు. వీరి మధ్య గొడవ జరుగుతున్న సమయంలోనే విమానం వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికుడు అతడి తల్లిదండ్రులు, బంధువులు సిబ్బందిపై గొడవకు దిగారు. ఎయిరిండియా సిబ్బంది ప్రయాణికుడిపై దురుసుగా వ్యవహరించటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే విమానం వెళ్లిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి జోక్యంతో సదరు ప్రయాణికుడికి టిక్కెట్ ధరను తిరిగి చెల్లించేందుకు ఎయిరిండియా సిబ్బంది అంగీకరించటంతో వివాదం సద్దుమణిగింది.

వైకుంఠ ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు

» భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు
» ఈవోలతో నిరంతరం సమీక్ష : కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : శుక్రవారం ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబుతో కలిసి వివిధ ఆలయాల ఈవోలు, దేవదాయ, రెవెన్యూ, పోలీసు తదితర సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంలో చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు సులభంగా దర్శనాలు జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వేదాద్రి నరసింహస్వామి ఆలయం, విజయవాడ బ్రాహ్మణ వీధి, లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల వద్ద క్యూలైన్లు, మంచినీటి సరఫరా, పారిశుధ్యం తదితర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎస్‌ఐ తదితర క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో వైకుంఠ ఏకాదశి దర్శనాల ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. భక్తులకు ఏర్పాట్లపై ప్రముఖ ఆలయాల ఈవోలతో నిరంతరం సమీక్షిస్తున్నామని, దేవదాయ, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా వుండాలని, ఎప్పటికప్పుడు ఆలయాలను సందర్శించి పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామని కలెక్టర్ చెప్పారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, ప్రసాదాల కౌంటర్లు తదితరాల విషయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా దేవదాయ అధికారి వి.సీతారామయ్య, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్, వివిధ ఆలయాల ఈవోలు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యో అమ్మా..

» ఎనికేపాడు వద్ద రోడ్డు ప్రమాదం
» ఐదు నెలల గర్భిణీ దుర్మరణం



యర్రంశెట్టి సుష్మ (ఫైల్)

ప్రసాదంపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : 'అమ్మా..' అనే మాట కోసం ఆమె ఎంతో ఆరాటపడింది. మరో నాలుగు నెలల్లో ఊపిరిపోసుకోనున్న కన్నపేగు కోసం ఆశగా ఎదురుచూసింది. విధి ఎంత బలీయమైందో.. ఆమె కలలను కల్లలు చేసింది. తల్లి సహా గర్భస్థ శిశువునూ బలితీసుకుంది. హృదయవిదారకమైన ఈ ఘటన ఎనికేపాడు జంక్షన్ వద్ద గురువారం జరిగింది. పటమట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎనికేపాడుకు చెందిన యర్రంశెట్టి సుష్మ (20)కు చీమలపాడుకు చెందిన గుర్రం సతీష్‌కుమార్‌తో గత మార్చిలో వివాహమైంది. సతీష్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో 5 రోజుల క్రితం సుష్మ ఎనికేపాడులోని పుట్టింటికి వచ్చింది. పండుగ సమీపించడంతో సుష్మాను చీమలపాడు తీసుకెళ్లడానికి మామ శ్రీనివాసరావు గురువారం ఎనికేపాడుకు వచ్చారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్రవాహనంపై ఎనికేపాడు జెండా సెంటర్ నుంచి రామవరప్పాడు వైపు వెళ్లడానికి జంక్షన్ వద్ద వారు ఆగారు. అదే సమయంలో రామవరప్పాడు నుంచి కానూరు వంద అడుగుల రోడ్డు వైపు వెళ్లేందుకు టిప్పర్ లారీ జంక్షన్ వద్ద ఆగింది. యూటర్న్ తీసుకునేటప్పుడు లారీ ముందు చక్రం శ్రీనివాసరావు నడుపుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో వాహనంపై ఉన్న సుష్మ వెనుక చక్రాల కింద పడిపోయింది. సుష్మ చేతిపైకి లారీ చక్రాలు ఎక్కడంతో చేయి నుజ్జునుజ్జైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో సుష్మ అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనివాసరావు ఎడమ కాలు విరిగింది. స్థానికులు అంబులెన్స్ సాయంతో క్షతగాత్రుడిని కొత్త ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలిని మార్చురీకి తరలించామని సీఐ వల్లభనేని పవన్‌కిషోర్ తెలిపారు. టిప్పర్ లారీడ్రైవర్, లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

లారీని అడ్డుకున్నారని..

» ఇసుక కార్మికులపై కేసు నమోదు
» నార్తువల్లూరు క్వారీలో తవ్వకాలు నిలిపివేత



సీజ్ చేసిన ఇసుక లారీ

తోట్లవల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరులో ధర్నా నిర్వహించి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇసుక కార్మికులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.అర్జునరాజు గురువారం తెలిపారు. నార్తువల్లూరు క్వారీనుంచి బుధవారం ఇసుక లోడుతో వస్తున్న లారీని తోట్లవల్లూరులో రేవులో నిలిపివేసి రాత్రి 9 గంటల వరకు ధర్నా, ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో లారీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తుండగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 20 మందికి పైగా కార్మికులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన ఇసుక లారీ విజయవాడకు చెందిన శ్రీధర్‌కు చెందినదిగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. కాగా ఇసుక కార్మికుల ధర్నా, ఆందోళన నేపథ్యంలో నార్తువల్లూరు క్వారీలో గురువారం తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. కార్మికులు, క్వారీ నిర్వాహకులు చర్చించుకుని సమస్య పరిష్కరించుకోనున్నట్టు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి చెప్పారు. అలాగే తోట్లవల్లూరు రీచ్‌లో అనుమతిలేని క్వారీని గురువారం నిలిపివేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15



భద్రాచలం రోడ్డు, డ్రెయిన్ అభివృద్ధి పనుల పరిశీలన

కంకిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వీధిలో రూ. 25 లక్షలతో జరుగుతున్న రోడ్డు, డ్రెయినేజీ అభివృద్ధి పనులను గురువారం టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్ అసిస్టెంట్ ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు అభివృద్ధికి కూడా ఎస్టిమేషన్లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పులి శ్రీనివాసరావు, పీఆర్ అసిస్టెంట్ ఇంజినీర్లు వరుణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు హరికృష్ణ



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందచేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

కంకిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన వల్లపు రమణయ్య ఆసుపత్రి ఖర్చుల కోసం రూ. 6 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని గురువారం ఆయన బాధిత కుటుంబానికి అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, పడవల మధుసూదనరావు, అనుమోలు ప్రభాకర్, కొండవీటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారుద్రయాగ మహోత్సవాలు ప్రారంభం

పెనమలూరు: మండలంలోని పెదపులిపాకలో గురువారం స్థానిక గంగా పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పంచముఖ మహారుద్రయాగ చండీ మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గురువారం నుంచి సోమవారం వరకు జరిగే ఈ ఉత్సవాలు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. గురువారం స్వామికి మహారుద్రయాగం నిర్వహించారు. చెన్నమల్లేశ్వరస్వామి భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూరల్ మండలం బీజేపీ అధ్యక్షుడిగా చిన్నారావు

విజయవాడ రూరల్ : రూరల్ మండలం బీజేపీ అధ్యక్షుడిగా బత్తుల చిన్నారావు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడుని పార్టీ కార్యాలయంలో గురువారం పలువురు నేతలు అభినందించారు. ఈ సందర్భంగా బత్తుల చిన్నారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్న పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వీల్ చైర్ అందజేత

గన్నవరం: కండరాల వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న ఆత్మకూరుకు చెందిన పాలపర్తి ప్రమోద్‌కు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.40వేలు విలువ చేసే షిఫ్టింగ్ వీల్ చైర్‌ను గురువారం అందజేశారు. వీల్ చైర్ అందించటంతో తన పని సాఫీగా సాగేందుకు తోడ్పడుతుందని ప్రమోద్ సంతోషం వ్యక్తం చేస్తూ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారన్నారు. 9 ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి రూ.75 వేలు నగదు బహుమతులను అందజేశామన్నారు. 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. సంస్థ మండల అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి కర్ర వరప్రసాద్, సహాయ కార్యదర్శి వీసం ప్రసాదరావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి

హనుమాన్‌జంక్షన్: ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా నిర్వహించాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సూచించారు. గురువారం బాపులపాడు వెలుగు కార్యాలయంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, నందివాడ మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సిబ్బందికి పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన కొలతలు, కూలీలకు మౌలిక వసతులు కల్పన విషయాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ఏపీవో అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

పూడిక తీత పనుల పరిశీలన

గంగూరు (కంకిపాడు) : గంగూరు ఛానల్‌లో పూడిక తీత పనులను గురువారం గంగూరు చానల్ నీటి పారుదల సంఘం అధ్యక్షుడు కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పంట కాలువలను పూడిక తీత పనులు చేపట్టి రైతులకు అవసరమైన సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు అబ్దుల్- రహీం, ఇరిగేషన్ జేఈ నాగబాబు, రైతులు ఆర్. శ్రీరాములు, ఉయ్యూరు పిచ్చేశ్వరరావు, చంద్రశేఖర్, అబ్దుల్ రహీం రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

ఉయ్యూరు : ఏజీఅండ్ఎస్‌జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఎండీ బాబు ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు గురువారం కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాబు ఎడ్యుకేషన్ సర్వీసెస్ ప్రతినిధి ఎంఎస్ఎస్ చక్రవర్తి, ఉపాధి శిక్షణాధికారి శ్రీనివాసరావు, కిషోర్, ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

పెనమలూరు: 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పెనమలూరు ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టరును ఆవిష్కరించి రోడ్డు భద్రతపై, హెల్మెట్ అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ పాండురంగారావు, ఎన్‌జీవో నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై చర్చ

ఉయ్యూరు : ఉయ్యూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీలికల్పన అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశంలో ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్నం, భీమవరం, తిరుపతి, భద్రాచలం తదితర ప్రాంతాలకు బస్సులు నడపాలని జబర్లపూడి సర్పంచ్ శేషవరప్రసాద్ విజ్ఞప్తి చేయగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్ వివరణ ఇచ్చారు. గ్రామాల్లో ఇంటిపన్ను సమస్యపై చినఓగిరాల సర్పంచ్ శిరీష అధికారుల దృష్టికి తీసుకు రాగా పరిష్కరిస్తామని ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు అన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

హనుమాన్‌జంక్షన్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆలయాలను దర్శించే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని జంక్షన్‌లో పలు దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తరద్వార దర్శనం నిర్వహిస్తున్నారు. దాని కోసం గురువారం ఆలయ ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనం ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం, రామాలయం ,బాపులపాడు శివాలయాల్లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడి కోట్లాదిమంది భారతీయుల మనోభావాలను దెబ్బతీసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని కృష్ణాజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తమలం ఝాన్సీరాణి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నందూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సాంబశివరావు,వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భోగిపళ్లు పోస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలవర్ధనరావు



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న సుభాష్‌చంద్రబోస్ , సత్యప్రసాద్



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు



భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



భోగి మంటలు ప్రిన్సిపాల్ షేక్ బాషా



ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో..

సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి

● ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా సంక్రాతి సంబరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్,జనవరి 9(ఆంధ్రజ్యోతి) : సనాతన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిలోని విజ్ఞానాన్ని యువతకు తెలియజెప్పటమే సంక్రాంతి సంబరాల ముఖ్య ఉద్దేశమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. వీరవల్లి టీడీపీ అధ్యక్షుడు లంక సురేంద్రమోహన బెనర్జీ ఆవరణలో మమతలపందిరి సేవా సమితి, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో నెహ్రూ యువజన కేంద్ర అధికారి సుంకర రాము, డీఆర్‌డీఏ మేనేజర్ కొడాలి సందీప్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. మమతల పందిరి వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ పర్యవేక్షణలో స్కిల్ డవలప్‌మెంట్ నారీశక్తి కుట్టు మిషన్ కేంద్రంలోని మహిళలకు రంగవల్లుల పోటీలు, ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు దిరిశం బాలకోటయ్య, అభిరుచి మధు సహకారంతో బహుమతులు అందజేశారు. ఉమావరప్రసాద్, ఏఎల్‌సీ ఛైర్మన్ తోట శ్యాంసుందర్, ఉపసర్పంచ్ లంక అజయ్, శ్రీధర్, బాబి, మోర్ల ఉషారాణి, రాయి గోపాలకృష్ణ, సాంబశివరాయల్, పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: జంక్షన్‌లోని బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలను గురువారం ఎంఈవోలు రాంబాలసింగ్, సురేష్‌కుమార్‌లు ప్రారంభించారు. హెచ్ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి వీరమాచనేని సత్యప్రసాద్ విద్యార్థులకు భోగి పళ్ల వేసి ఆశీర్వదించారు. భోగి మంటలు, ముగ్గులు, కోలాటం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. విశ్వకవి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఆ పాఠశాల నిర్వాహకులు కెఎస్ఎస్ ముఖర్జీ, కె.అనిత ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు: స్థానిక వికాస్ మోడల్ పాఠశాల కరస్పాండెంట్ చిగురుపాటి వివేకానంద విద్యార్థులతో కలిసి సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ చిగురుపాటి నాగరాణి, ఉపాధ్యాయులు పెండ్యాల రాజేష్ పాల్గొన్నారు.

కానూరు: భాష్యం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. పాఠశాలను విద్యార్థులు రంగురంగుల ముగ్గులతో ముంచెత్తారు. కోడిపందేలు, గంగిరెద్దులను ప్రదర్శించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల జడ్ఈవో జోసెఫ్‌జోషి హాజరై విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. జడ్‌సీవో బ్యూలా, ప్రిన్సిపాల్ శైలజలు తమ సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు.

గన్నవరం: నారాయణ పాఠశాలలో విద్యార్థులకు భోగిపండ్లు పోశారు. ప్రిన్సిపాల్ షేక్ బాషా , కో-ఆర్డినేటర్ లియోని, సత్తిరెడ్డి, శిరీషా, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

ఉయ్యూరు: శ్రీ ఎంకే ఇగ్లీషుమీడియం స్కూల్, శ్రీవిశ్వశాంతి స్కూల్‌ల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎంకే ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు ఛైర్మన్ వి.సత్యనారాయణ, ఆర్డీవో సుబ్బారావు అతిథులుగా హాజరై విద్యార్థులతో కలసి ఉల్లాసంగా గడిపారు. విజేతలకు బహుమతులు అందచేశారు. స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబు పాల్గొన్నారు. శ్రీవిశ్వశాంతి స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఎం. సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

12న సంక్రాంతి సాంస్కృతిక వైభవం

పెనమలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా యనమలకుదురు శివాలయం కొండ ఎదురుగా కృష్ణా కరకట్టపైన విజయవాడ స్నేహాలయ ఆర్ట్స్, రావి నాంచారయ్య ట్రస్టు సంయుక్త నిర్వహణలో ఈ నెల 12న సంక్రాంతి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొజ్జ గౌరీశంకర్, దేవబత్తిన హనుమంతరావు, పిళ్లా మోహన్‌రావు, రావి వెంకట్, బొమ్మారెడ్డి రవిశంకర్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఛైర్మన్ తేజస్వి పొడపాటిలు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంక్రాంతి పురస్కారాల ప్రదానోత్సవం, ప్రముఖ రంగస్థల నటుడు



పోస్టరును ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆచంట బాలాజీ నాయుడుకు స్వర్ణ కిరీట ధారణ, చెన్నకేశవుల నాగమల్లేశ్వరరావుకు రతన్‌టాటా సేవా పురస్కారం, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్యకు రావి నాంచారయ్య స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం జబర్దస్త్ ఫేం నవీన్, వినోదినిల హాస్య కార్యక్రమం, చింతామణి నాటకం ఉంటాయని తెలిపారు. పేద కళాకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆరో రోజుకు నవదిన ప్రార్థనలు



జపమాల ప్రార్థన నిర్వహిస్తున్న ఫాదర్లు

ఉంగుటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి తిరునాళ్ల సందర్భంగా పెదఅవుటపల్లిలోని తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ ఆధ్వర్యంలో జరుగుచున్న నవదిన ప్రార్థనలు గురువారం ఆరవ రోజుకు చేరాయి. సాయంత్రం 5.30ని,లకు ప్రారంభమైన ఈప్రార్థనల్లో ప్రధాన యాజకులుగా హాజరైన నూజివీడు టౌన్ విచారణ గురువులు రెవ.ఫాదర్ లాము జయరాజు , సహచర గురువులతో కలిసి జపమాల, ప్రార్థన నిర్వహించారు. అనంతరం దివ్యపూజాబలిని సమర్పించి, పాప సంకీర్తనం, ఆవశ్యకత, అనుగ్రహం అనే అంశంపై ప్రసంగించారు. ఈ ప్రార్థనలను తుట్టగుంట, వీరపనేని గూడెం, మెట్లపల్లి సంఘస్తులు, మరియదళం, సీఎఫ్ఎంఎస్ఎస్ సిస్టర్స్ కొనియాడారు.తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ మాట్లాడుతూ తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో విచారణ గురువులు రెవ.ఫాదర్ గోపు అభిలాష్, ఇతర సహాయక గురువులు, కన్యాస్త్రీలు, మరియదళ సభ్యులు, గుడిపెద్దలు, సంఘస్తులు,పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ దాడులు


ఉంగుటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తేలప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై గురువారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, గుడివాడ ఆపరేషన్ ఈఈ జీబీ శ్రీనివాస్ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 41బృందాలుగా ఏర్పడి సెక్షన్ పరిధిలోవున్న 3069 గృహసర్వీసులు, 100 వాణిజ్య సముదాయాలు, 5 ఇతర సర్వీసులను తనిఖీ చేశారు. వీటిల్లో అదనపులోడు(393కిలోవాట్స్)వాడిన 289సర్వీసులకు రూ.7లక్షల 84వేల జరిమానా విధించారు. ఈసందర్భంగా విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు మాట్లాడుతూ ఎక్కడైనా విద్యుత్ చౌర్యం



సూచనలు చేస్తున్న ఈఈ శ్రీనివాస్

జరిగినట్లయితే 9440812362, 9440812363, 8331014951 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో హనుమాన్‌జంక్షన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, తేలప్రోలు ఏఈ జె.దుర్గారావు, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



డ్రోన్ టెక్నాలజీ, తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏ. గోపిరాజా

ప్రసాదంపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడులోని విజయ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఫోపిల్ డ్రోన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎంవోయూ కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపాల్ టి. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో డ్రోన్ ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌తో పాటు ఉద్యోగాలు కల్పించేలా డ్రోన్ టెక్నాలజీ కంపెనీతో అవగాహన చేసుకున్నామన్నారు. అనంతరం ఫోపిల్ సంస్థ వ్యవస్థాపకులు ఏ. గోపిరాజా డ్రోన్ టెక్నాలజీ, తయారీ విధానం, ఉపాధి అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు బి. కృష్ణారావు, ఈసీఈ విభాగాధిపతి టి. విష్ణుప్రియ, విద్యార్థినీ, విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో శ్రీజ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థులు అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.శివకుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభి నందించింది.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉయ్యూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నల్లచట్టాలు తెచ్చి రైతులు, కౌలురైతుల నడ్డి విరుస్తున్నాయని, స్వామినాథన్ కమిషన్ అమలుకు శ్రద్ధ చూపడంలేదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు. స్థానిక శ్రామిక భవన్‌లో రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో 2025 సంవత్సర క్యాలెండర్ గురువారం ఆవిష్కరించారు. కౌలు రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు కె.శివనాగేంద్రం, పంచకర్ల రంగారావు,నాగేశ్వరరావు, శివశంకర్‌పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

గన్నవరం: భవిత కేంద్రాలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం కూడా అవసరమని వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రానికి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగబాబు రూ.35వేలు విలువ చేసే రంగుల రాట్నం, జారుడు బల్లను వితరణగా గురువారం అందజేశారు. ఎంఈవో కె.రవికుమార్ దాత రంగబాబును అభినందించారు. ఎంఈవో-2 కమల తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గన్నవరం: జిల్లాలోని 26 మండలాల్లో గత 32 రోజులుగా జరిగిన రెవెన్యూ సదస్సులలో ఎక్కువ అర్జీలు గన్నవరం మండలంలో వచ్చాయి. జిల్లా మొత్తం 4757 అర్జీలు రాగా మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 347 అర్జీలు వచ్చాయి. వీటిల్లో 189 అర్జీలను పరిష్కరించగా 157 పెండింగ్, విచారణలో ఉన్నాయని తహసీల్దార్ కేవీ శివయ్య తెలిపారు.పెండింగ్‌లో ఉన్న 157 అర్జీలను త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

13న ముగ్గుల పోటీలు

గన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 9గంటల నుంచి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 12న సాయంత్రం 5గంటలలోపు ఆలయం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

12న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గన్నవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వీకేఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 12న జరుగుతుందని ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఎంవీఎల్ ప్రసాద్, కార్యదర్శి ఎన్‌బి మురళీ కృష్ణలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయండి

కంకిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చలవాది రాజా అన్నారు. కంకిపాడు చైతన్య కళాశాల వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సమావేశంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సెంగెపు రంగారావు, అన్నే రామారావు, వణుకూరు విక్రం, సుబ్బారావు, అన్నవరపు శివపార్వతి, బొర్రా వెంకట్, కోడెల సురేష్, బీజేపీ నాయకులు దివి రోహిణి కుమారి తదితరులు పాల్గొన్నారు.

దిగుబడుల్లేక కుదేలైన పత్తి రైతుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) నుంచి 'మద్దతు' కరువైంది. మద్దతు ధరతో రైతులకు అందుబాటులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు చేయకుండా, ఎంపిక చేసిన జిన్నింగు మిల్లుల వద్దే పత్తి కొనుగోలు చేసింది. పాలకులూ పట్టించుకోకపోవటంతో అయినకాడికి తెగనమ్ముకున్న రైతులు నష్టపోవాల్సి వచ్చింది. వ్యాపారులు, దళారులకు మాత్రమే ఉపయోగపడిన సీసీఐ వల్ల తమకు ఒనగూరిన ప్రయోజనమేంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కంచికచర్ల యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య(ఫైల్)

పత్తి రైతుకు మద్దతు కరువు

- సీసీఐ కొనుగోళ్లలో అధిక శాతం జిన్నింగు మిల్లుల వద్దే
- అలంకారప్రాయంగా వ్యవసాయ మార్కెట్ యార్డులు
- దళారులకు తక్కువ ధరకు అమ్ముకున్న రైతులు

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

ఎన్టీఆర్ జిల్లాలో తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఈ ఏడాది రైతులు లక్ష ఎకరాలకు పైగా పత్తిసాగు చేశారు. ఆగస్టు చివరి, సెప్టెంబరు మొదటి వారాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు 35 వేల ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. గూడ, పూత, పిందె రాలిపోయాయి. దీనికితోడు పలు ప్రాంతాల్లో గులాబీ రంగు పురుగు దాడి చేయడంతో ఆశించిన దిగుబడులు రాలేదు. ఎక్కువ మంది రైతులకు ఎకరానికి సగటున ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఎకరానికి పెట్టుబడి రూ.50 వేలకు పైగా అయింది. దీనికితోడు పత్తితీత కూలి ఖర్చు ఎక్కువైంది. చేలు దెబ్బతిని, ఆశించిన దిగుబడులు రాక నిలువునా కుదేలైన పత్తి రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ దోబూచులాడడంతో మద్దతు ధర అందని ద్రాక్షగా మారింది.

నష్టాలు మూటగట్టుకున్న రైతులు

ఈ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7,521 ప్రకటించింది. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు ఏఎంసీ పరిధిలోని గంపలగూడెం, ఎ.కొండూరు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, పత్తి కొనుగోలు చేస్తామంటూ అధికారులు ప్రకటించారు. దీంతో మద్దతు ధర లభిస్తుందని రైతులు ఆశపడ్డారు. మద్దతు ధర సంగతి దేవుడెరుగు? యార్డుల్లో పెద్దగా కొనుగోళ్లు జరపలేదు. కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట యార్డుల్లో కొద్దిగా కొని మమ అనిపించారు. 90 శాతం జిన్నింగు మిల్లుల వద్దనే సీసీఐ కొనుగోలు చేసింది. యార్డుల్లో సీసీఐ కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది. గుంటూరు జిన్నింగు మిల్లుల వద్దకు తీసుకువెళ్లేందుకు రైతులు అధిక వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. పత్తి బోరాల్లో తొక్కించి, లారీలకు ఎగుమతి చేసి, జిన్నింగు మిల్లులకు తరలించాలి. ఒకటికి రెండు రోజులు వ్యవసాయ పనులు మానుకుని గుంటూరు వెళ్లాలి. అక్కడ పెడుతున్న నిబంధనలతో మద్దతు ధర లభించడం లేదు. యార్డుల్లో కొనకపోవటంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులకు, దళారులకు తక్కువ ధరకు అమ్ముకున్నారు. గిట్టుబాటు ధర రాక నష్టాలు మూటగట్టుకున్నారు.

వ్యాపారులు, దళారులకు మేలు

రైతుల వద్ద క్వింటా రూ.ఆరువేల నుంచి రూ. 6,800కు కొన్న వ్యాపారులు, దళారులు అదే పత్తిని రైతుల పేర్లతోనే సీసీఐకు విక్రయించి లాభపడ్డారు. ఈ క్రాప్ చేసిన రైతుల పత్తిని రూ.6,500 నుంచి రూ.6,800 వరకు కొనగా, ఈ క్రాప్ చేయని వారి పత్తిని రూ.6వేల నుంచి రూ. 6,500 వరకు కొంటున్నారు. రైతులను కార్లలో గుంటూరు తీసుకువెళ్లి, బయోమెట్రిక్ వేయిస్తున్నారు. రైతుల ఖాతాలో సొమ్ములు జమ కాగానే, తమ ధర ప్రకారం రైతులకు లెక్కగట్టి, రైతులకు పోనూ మిగతా సొమ్మును వ్యాపారులు, దళారులు తీసుకుంటున్నారు.

యార్డుల్లో కొన్నది 8,447 క్వింటాళ్లే..

ఈనెల ఆరో తేదీ వరకు జిన్నింగ్ మిల్లుల వద్ద 4,10,142 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. ఇందులో అద్దెకు తీసుకున్న జిన్నింగు మిల్లుల వద్ద 4,01,695 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కేవలం 8,447 క్వింటాళ్లే కొన్నది. ఇది కూడా కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట యార్డుల్లోనే..మైలవరం, తిరువూరు యార్డుల్లో కిలో కూడా కొనలేదు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి..పట్టించుకోని పాలకులు

యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, హామీలు గుప్పించిన పాలకులు ఆ తర్వాత పట్టించుకోలేదు. మద్దతు ధర లభించకపోయినా, యార్డుల్లో కొనుగోళ్లు జరగపోయినా చూస్తూ ఊరుకున్నారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కూడా యార్డుల్లో కొనుగోళ్లకు పెద్దగా ప్రయత్నించలేదు. అధికారుల దృష్టంతా మార్కెట్ సెస్ పైన ఉంది. యార్డుల్లో కొంటే, ఆ పత్తిని గుంటూరు మిల్లులకు తరలించేందుకు రవాణా ఖర్చును యార్డులు భరించాలి. దీంతో అధికారులు మౌనంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- వారి సమస్యలన్నీ పరిష్కరిస్తాం: ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

అవనిగడ్డ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఆర్టీసీ యాజమాన్యం పని చేస్తోందని ఆ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. బుధవారం అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి మూడు కొత్త బస్సులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. 'ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన తర్వాత కొన్ని సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటికి పరిష్కారం చూపుతాం. మెరుగైన వైద్యసేవల కల్పన, పెన్షన్ల పెంపునకు ప్రాధాన్యమిస్తాం. త్వరలోనే వారి సంక్షేమానికి చర్యలు చేపడతాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవనిగడ్డ డిపోకు 11 నూతన బస్సులు సమకూర్చాం. దూరప్రాంత సర్వీసులన్నీ నడుస్తున్నాయి. డిపోలో రూ.12 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తాం. అమరావతి ప్రాంతానికి ఈ నెల 22 నుంచి సర్వీసు ప్రారంభిస్తాం.' అని



అవనిగడ్డ డిపోలో మూడు నూతన బస్సులను ప్రారంభిస్తున్న కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. రాజధానిలో కోర్టు, సచివాలయ పనులు పూర్తి చేసుకునేందుకు వీలుగా అమరావతికి అన్ని డిపోల నుంచి బస్సులను నడపాలని కొనకళ్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. అవనిగడ్డ డిపోకు ఆరు నెలల్లో 13 కొత్త బస్సులు ఇచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ ఈడీ జి.విజయరత్నం, ఈఈ రాజశేఖర్, డీపీటీవో వాణిశ్రీ, డీఎం కె.వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ చార్జీలు పెంచబోం: కొనకళ్ల నారాయణ

సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం వేయబోమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. అందుకోసం 7,200 బస్సులను అదనపు చార్జీలు లేకుండా స్పెషల్ సర్వీసులుగా నడుపుతామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు మంత్రుల బృందం తెలంగాణ, కర్ణాటకలో పర్యటించి పథకం అమలుపై అధ్యయనం చేసిందన్నారు. ఉచిత ప్రయాణం అమలు ద్వారా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా కొత్త బస్సులు, అదనపు సిబ్బంది నియామకం చేస్తామని ఆయన తెలిపారు. ఆర్టీసీలో పది వేల ఎలక్ట్రికల్ బస్సులు ఉండాలన్నదే ఆర్టీసీ యాజమాన్యం లక్ష్యమని, 1,000 ఎలక్ట్రికల్ బస్సులకు ఇప్పటికే ఆర్డర్ పెట్టిందని కొనకళ్ల తెలిపారు.

ప్రతి నెలా చేనేత ఎగ్జిబిషన్లు

- నికె హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో మంత్రి సవిత



రాట్నం తిప్పుతున్న మంత్రి సవిత

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రతినెలా ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని మంత్రి ఎస్.సవిత తెలిపారు. గురువారం విజయవాడలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నికె హ్యాండ్లూమ్ మార్కెటింగ్ ఎక్స్‌పోను మంత్రి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ వీవర్స్ సర్వీస్ సెంటర్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎక్స్‌పోను వారం పాటు నిర్వహిస్తున్నామన్నారు. సంక్రాంతికి ప్రజలంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించాలని ఆమె పిలుపునిచ్చారు. గడిచిన 6 నెలల్లో మూడు ఆప్కో షోరూంలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో మరికొన్ని ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 10 క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు ఆదిత్య బిర్లా గ్రూపు సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాలతో నేతన్నలకు 365 రోజులు పాటు పని కల్పించేలా టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. త్వరలో 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని మంత్రి తెలిపారు. ఆప్కో ఎండీ పావనమూర్తి, వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ సాహు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ముఖేశ్‌కుమార్ మీనా

వన్‌టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని డిప్యూటీ ఈవో రత్నరాజు అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనం అందించారు.



రెవెన్యూ, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్ కుమార్ మీనాకు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

30 నుంచి పారా అథ్లెటిక్స్ రాష్ట్ర పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వేదికగా ఆరో బెటాలియన్- ఏపీఎస్పీ మంగళగిరిలో ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న ఏడవ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల బ్రోచర్లను శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరీషా తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఏపీ పారా స్పోర్ట్సు అసోసియేషన్, శాప్ సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు గిరీషా తెలిపారు. నూతన క్రీడా విధానంలో పారా క్రీడాకారులకు ప్రత్యేక స్థానం కల్పించామని అవకాశాన్ని పారా క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఏపీ కార్యదర్శి వి.రామస్వామి, గుంటూరు జిల్లా పారాస్పోర్ట్సు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ దేవనబోయిన ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, అంతర్జాతీయ పారా క్రీడాకారిణి శివగంగ దుర్గ, జాతీయ క్రీడాకారుడు గాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శుక్ర,శని, ఆదివారాలు, పండుగ రోజులు, శెలవు దినాల్లో

దుర్గగుడి ఉద్యోగులకు ప్రత్యేక విధులు

- ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు

వన్‌టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్ర, శని, ఆదివారాలు, పండగ రోజులు, శెలవు దినాల్లో రద్దీ దృష్ట్యా ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగులు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు ప్రత్యేక విధులు కేటాయిస్తూ దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. వారాంతపు సెలవు దినాలు, పండగ రోజులు, పబ్లిక్ సెలవులు, శుక్ర, శని, ఆదివారాల్లో ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివస్తున్న కారణంగా రద్దీని నియంత్రించేందుకు, భక్తులకు సులభంగా, శీఘ్రంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూసేందుకు దేవస్థానంలో పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి భక్తుల రద్దీ తగ్గి చివరి భక్తుడు అమ్మవారిని దర్శించుకునేంత వరకు విధులు నిధులు నిర్వహించాలని ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులకు ఉత్తర్వులు జారీచేశారు. వారంతా తమ రోజువారీ విధులతో పాటు అదనపు విధులను నిర్వహించాల్సి ఉంటుందని అందులో స్పష్టం చేశారు. ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలను తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు మొత్తం భక్తుల రద్దీని గమనించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో ఆయన సూచించారు.

రద్దీవేళ.. రద్దుల పర్వం

- విజయవాడ - విశాఖ మార్గంలో నాలుగు రైళ్ల రద్దు
- పండుగకు రెండు రోజుల ముందు రైల్వే నిర్వాకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సంక్రాంతికి స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్టు ఇటీవలే ప్రకటించిన రైల్వే శాఖ తాజాగా విజయవాడ-విశాఖపట్నం మార్గంలో నాలుగు షెడ్యూల్ రైళ్లను వరసగా రెండు రోజుల పాటు రద్దు చేసింది. పండుగ ప్రయాణాల సమయంలో రైల్వే అధికారులు విజయవాడ డివిజన్ పరిధిలో ఆటోమేటిక్ సెక్షన్ పనులు చేపట్టారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు ఇలాంటివి చేయకుండా పండుగ ముగిసే వరకు పనులు వాయిదా వేయాలని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే అప్రమత్తం చేసింది. కానీ రైల్వే అధికారులు పండుగ ప్రయాణాల సమయంలోనే ఆటోమేటిక్ సెక్షన్ పనులు చేపట్టారు. దీంతో పండుగకు రెండు రోజుల ముందు ఈనెల 11వ తేదీన 2 రైళ్లు, 12న 2 రైళ్ల చొప్పున రద్దు చేశారు. ప్రస్తుతం విజయవాడ-విశాఖపట్నం మార్గంలో విపరీతమైన రద్దీ నడుస్తోంది. రైళ్లన్నీ కిటకిటలాడుతూ కిక్కిరిసిపోతున్నాయి.

రద్దయిన రైళ్లు

కాకినాడ పోర్టు -విశాఖపట్నం(ట్రైన్ నెంబర్ 17267), విశాఖపట్నం - కాకినాడపోర్టు(17268), గుంటూరు - విశాఖపట్నం(17239), విశాఖపట్నం - గుంటూరు(ట్రైన్ నెంబర్ 17240)

వందేభారత్, స్పెషల్ రైళ్ల కోసమేనా..

సంక్రాంతి రద్దీ సీజన్‌లో పనుల పేరుతో రైళ్లను రద్దు చేయడంలో రెండు రకాల అనుమానాలు రేకెత్తుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా ఇప్పటికే స్పెషల్ రైళ్లను అధికారులు ప్రకటించారు. షెడ్యూల్ రైళ్ల రద్దుతో స్పెషల్ రైళ్లలో అధిక ధరలు చెల్లించి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. దీంతో పాటు విజయవాడ-విశాఖపట్నం మార్గంలో వందే భారత్ రైలుకు మరింత డిమాండ్ తెచ్చేందుకు కూడా విశాఖపట్నం మార్గంలోని రైళ్లను రద్దు చేశారన్న ప్రచారం జరుగుతోంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో డైనమిక్ ఫేర్ అమల్లో ఉంది. తక్కువ సీట్లు ఉంటే చివరి నిమిషంలో ఎక్కువ ధర పలుకుతుంది. సంక్రాంతి పండుగను సొమ్ము చేసుకునేందుకే రైల్వే ఈ తరహా వ్యవహారాలు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగ ముగిసే వరకైనా రైళ్లను రద్దు చేయొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.

మట్టి తరలిస్తున్న 11 టిప్పర్లు స్వాధీనం

- ఏడీసీపీ రామకృష్ణ ఆధ్వర్యంలో దాడులు

వన్‌టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి ప్రాంతంలో అనధికారికంగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై నగర పోలీసు ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. అనధికారిక మట్టి తరలింపుపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావటంతో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు ఆదేశాలతో ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు, దాడులు చేశారు. రహస్యంగా మట్టి లోడు టిప్పర్లను గుణదల, గుంటూరు జిల్లాలకు తరలిస్తుండడంతో ఏడీసీపీ పక్కా ప్లాన్‌తో నిఘా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొత్తూరు తాడేపల్లి వైపు నుంచి 30 మట్టి లోడు వాహనాలు బయలుదేరాయని సమాచారం అందుకున్న ఏడీసీపీ తమ సిబ్బందితో పాముల కాలువ, పలు సెంటర్ల వద్ద సిబ్బందిని నియమించారు. ఒక టిప్పర్ డ్రైవర్‌కు తెలియకుండా మరో టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కొత్తపేట పోలీసులకు డ్రైవర్లను అప్పగించారు. పోలీసులు వారిని మైన్స్ డిపార్టుమెంట్ అధికారులకు అప్పగించగా వారి పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను ఏడీసీపీ ఆదేశాల మేరకు కొత్తపేట పోలీసులు జక్కంపూడిలోని ఖాళీ స్థలంలో నిలుపుదల చేశారు. పోలీసులు దాడులు చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న మరికొందరు డ్రైవర్లు పరారయ్యారు.



జక్కంపూడిలో నిలిపి ఉంచిన పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

అల్లుడి దాడిలో అత్త మృతి

- పోరంకి ప్రభునగర్‌లో ఘటన..కేసు నమోదు

పెనమలూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తన కుమార్తెను పాఠశాలకు వెళ్లకుండా మాన్పించి, షాపింగ్ మాల్‌లో పనికి చేర్పించారంటూ అత్తపై అల్లుడు దాడి చేశాడు. దీంతో అత్త అక్కడికక్కడే మృతి చెందింది. అల్లుడు పరారయ్యాడు. ఈఘటన పోరంకి ప్రభునగర్ శ్రీనగర్ కాలనీలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తన భర్త నరేష్(తెలంగాణ)తో విభేదాల కారణంగా నారబోయిన స్వర్ణలత పోరంకి ప్రభునగర్ శ్రీనగర్ కాలనీలోని తన తల్లి రాణి వద్ద రెండేళ్లుగా ఉంటోంది. కుమార్తెను ఉయ్యూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివించేవారు. కొంతకాలం క్రితం చదువు ఇష్టంలేదని కుమార్తె బడికి వెళ్లడం మానేసి, తల్లి స్వర్ణలత, అమ్మమ్మ రాణితో కలిసి ఇంటివద్దనే ఉంటోంది. దీంతో నరేష్ తన కుమార్తెను చదువు మాన్పించి పనిలో పెడతారా అంటూ అనేకసార్లు ఇంటికి వచ్చి గొడవ పడుతుండేవాడు. గురువారం తెల్లవారుజామున అత్త రాణి బ్రష్ చేసుకుంటుండగా ఆకస్మాత్తుగా నరేష్ ఇంట్లోకి వచ్చాడు. తన కుమార్తెను బడికి పంపకుండా మాన్పించేస్తారా.. పొలాన్ని కూతురు పేర రాయమంటారా? అని గొడవ పెట్టుకున్నాడు. బూతులు తిడుతూ పక్కనే ఉన్న కర్రతో రాణి తలపై బలంగా మోదాడు. ఆ దెబ్బకు రాణి కింద పడిపోయింది. అత్తపై కూర్చుని రాయితో తలపై బలంగా కొడుతుండడంతో రాణి పెద్దగా అరిచింది. అరుపులు విన్న కూతురు స్వర్ణలత బయటికి వచ్చి చూసేసరికి రాణి కింద పడిపోయి ఉంది. స్వర్ణలతను తోసుకుంటూ నరేష్ బయటకు పరారయ్యాడు. స్థానికులు 108కు ఫోన్ చేసి విజయవాడ జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి రాణి అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నరేష్ కోసం గాలిస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఓ అండ్ ఎం టెండర్లలో

అవినీతిపై హైకోర్టులో కేసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) పరిధిలో ఇటీవల పిలిచిన మంచినీటి రిజర్వాయర్ల ఓ అండ్ ఎం కాంట్రాక్టు టెండర్లలో అవినీతి వ్యవహారాలు జరిగాయని పలువురు కాంట్రాక్టర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇద్దరు కాంట్రాక్టర్లు హైకోర్టులో నాలుగు కేసులు వేశారు. కాంట్రాక్టర్ గుత్తికొండ శేషుకుమార్ 3, కాంట్రాక్టర్ కొల్లి భూపతిరెడ్డి ఒక కేసు వేశారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ విద్యాసాగర్ పీకల్లోతు అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. ఇటీవల ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించడంతో ఆయన రూటు మార్చారు. వీఆర్ఎస్‌ను వెనక్కి తీసుకుని లాంగ్ లీవు పెట్టాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

హైటెక్ బరులు

- జిల్లాలో కోడి పందేల నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు
- అంపాపురంలో 12 ఎకరాల్లో భారీ సెట్టింగ్
- ఎల్ఈడీ తెరలు, విద్యుత్ దీపాలు, వీఐపీ గ్యాలరీలు
- రికార్డు స్థాయిలో పందేల నిర్వహణకు ప్రణాళిక
- హోటళ్లలో రూమ్‌లు బుక్ చేసుకున్న పందెం రాయుళ్లు
- చేతులు మారనున్న కోట్ల రూపాయల నగదు

సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల నిర్వహణకు హైటెక్ హంగులతో బరులు సిద్ధమవుతు న్నాయి. బాపులపాడు మండలం అంపాపురంలో 12 ఎకరాల వెం చర్‌లో భారీగా ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఎల్ఈడీ తెరలు, విద్యుత్ దీపాలు, వీఐపీల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను రెడీ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో పందేల నిర్వహణకు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్ప టికే పందెం రాయుళ్లు హను మాన్‌జంక్షన్‌లో హోటల్ రూమ్ లను బుక్ చేసుకున్నారు. ఈ ఏడాది కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయి.

ఆంధ్రజ్యోతి-హనుమాన్‌జంక్షన్‌రూరల్ /విజయవాడ రూరల్: సంక్రాంతి కోడి పందేలకు హైటెక్ హంగులతో బరులు రెడీ అవుతున్నాయి. ఒక వైపు అధికారులు ఊరుకునేది లేదంటూ హెచ్చరిస్తు న్నా.. మరో వైపు నిర్వాహకులు ఉరిమే ఉత్సాహంతో చకచకా బరులను సిద్ధం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రా ల్లో పేరెన్నికగన్న బాపులపాడు మండలం అంపాపురం ప్రధాన బరి కాగా, కె.సీతారాంపురం, బిళ్లనపల్లి గ్రామాల్లో చిన్నపాటి బరులను సిద్ధం చేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, జక్కంపూడిలో పందేలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న 12 ఎకరాల వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్న బాపులపాడు మండలం అంపాపురం బరికి హైటెక్ హంగులతో సొబగులద్దుతున్నారు. భారీ సెట్టింగులు, ఎల్ఈడీ తెరలు, వీఐపీ ట్రీట్మెంట్లతో ప్రధాన బరి సిద్ధమవుతుండగా, పక్కనే మరో మూడు బరులను రెడీ చేస్తున్నారు. పేకాట, గుండాట, కోసుల నిర్వహణ, బిర్యానీ పాయింట్ల ఏర్పాట్లకు పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అన్నిరకాల వినోదాలు అందించేందుకు నిర్వాహకులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఇప్పటికే రహదారులు శుభ్రం చేసి రంగులు వేస్తూ రాకపోకల మార్గాన్ని ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. రాత్రి పూట పందేలకు ఇబ్బంది లేకుండా భారీ ఎల్ఈడీ లైట్లు, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా జనరేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు కోడిపందేల బరితో ప్రత్యేకత చాటుకుంటున్న అంపాపురం మరోసారి రూ.కోట్లలో పందేలు నిర్వహించేందుకు సన్నద్ధమ వుతోంది.



విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో ఫెన్సింగ్ వేసి బరిని సిద్ధం చేస్తున్న కూలీలు

పండగ మూడు రోజులు గతంలో జరిగినట్లే భారీగా పందేలు నిర్వహించడంతో పాటు విజేతలకు భారీ నజరానాలు, బహుమతులు ఇచ్చేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకుల్లో ఒకరు తెలిపారు. పందెం రాయుళ్లు విజయవాడ, గన్నవరం లాంటి ప్రాంతాలతో పాటు హనుమాన్‌జంక్షన్ లాంటి గ్రామాల్లో సైతం హోటళ్లలో గదులు బుక్ చేసుకుని పందేల కోసం ఎదురుచూస్తున్నారు.

జక్కంపూడి బరిని ధ్వంసం చేసిన కొత్తపేట పోలీసులు

కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి ప్రాంతంలో ఆఘమేఘాల మీద సిద్ధం చేసిన కోడి పందేల బరిని పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. సుమారు ఎకరం పరిధిలో భూమిని చదును చేసిన విషయాన్ని తెలుసుకున్న ఎస్సై హరిప్రసాద్ సిబ్బందితో బరి వద్దకు చేరుకుని ట్రాక్టర్లతో చదును చేసిన ప్రాంతాన్ని దున్నించారు.

ఎలాంటి పొరపాట్లు జరగలేదు

- అవినీతిలో బాద్‌షా కథనంపై సాంఘిక సంక్షేమశాఖ ఈడీ షాహిద్‌బాబు ప్రకటన

మచిలీపట్నం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖలో పరిపాలనాపరమైన అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగలేదని సాంఘిక సంక్షేమశాఖ ఈడీ షాహిద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో అవినీతిలో బాద్‌షా అనే శీర్షికతో ఈనెల 9న వచ్చిన కథనంపై ఆయన ప్రకటన విడుదల చేశారు. తాను సాంఘిక సంక్షేమశాఖ ఈడీగా, గన్నవరం ఎలక్టోరల్ అధికారిగా, గన్నవరం ప్రత్యేక అధికారిగా, రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ కమిషన్ ప్రత్యేక విధుల్లో ఉండటంతో మచిలీపట్నంలోని కార్యాలయానికి రోజూ వెళ్లడం లేదని తెలిపారు. కానీ పరిపాలనపర మైన అంశాలను ఈ-ఆఫీస్ ద్వారా చూస్తున్నట్లు వివరించారు. కంకిపాడు, మోటూరులోని వసతిగృహాలు నాలుగేళ్లుగా పనిచేయడంలేదని, అక్కడ పనిచేసే వార్డెన్లను సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌కు అటాచ్ చేశామని, అక్కడ వారి సేవలను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. వారి హాజరును బట్టి జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమశాఖలో కొందరు ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చామని, ఉన్నతాధికారుల సూచనలమేరకే పారదర్శకంగా పదోన్నతులు ఇచ్చామని తెలిపారు. తాను వచ్చినప్పటి నుంచి సాంఘిక సంక్షేమశాఖలో పనిచేస్తున్న వారిని డిప్యూటేషన్‌పై ఎవరినీ పంపలేదని, గతంనుంచి అక్కడ పనిచేస్తున్న వారి హాజరును బట్టి జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో, ఉద్యోగుల పదోన్నతుల్లో, ఉద్యోగులను అప్కాస్‌లో చేర్చే అంశాల్లో ఎలాంటి నగదు వసూళ్లు జరగలేదని తెలిపారు. వసతిగృహాల్లో రికార్డుల పరిశీలన నిబంధనలకు లోబడే జరుగుతోందని పేర్కొన్నారు. రాకేశ్ అనే ఉద్యోగి రెండునెలలుగా విధులకు హాజరు కావడంలేదని, అతనిపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేశామని తెలిపారు. సిబ్బంది ఎవరినీ తన సొంతపనులకు వినియోగించుకోవడం లేదని, వచ్చిన కథనంలో వాస్తవాలు లేవని ఆయన వివరణలో తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

కృష్ణలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రికగ్నిజేషన్ సంఘం ఏపీ హంస ప్రతినిధి బృందం గురువారం చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మారేడుమిల్లిలో జరిగిన ఘటనను సీఎస్‌కు వివరించి ఇటువంటివి మరలా జరగకుండా ఉండేలా చూడాలని కోరారు. రెగ్యులరైజేషన్ ప్రాసెస్‌లో రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాలు, ట్రెజరర్ వై.శ్రీనివాస్, జాయింట్ జనరల్ సెక్రటరీ జాన్ హెన్రి, కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ రామకృష్ణ, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ జె.సరోజిని పాల్గొన్నారు.



చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీ హంస ప్రతినిధి బృందం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

గోదాములను వినియోగంలోకి తీసుకురావాలి : రావి

గుడివాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములను పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రావి వెంకటేశ్వరరావు కోరారు. విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఖాళీగా ఉన్న గోదాములు తక్షణమే వినియోగంలోకి వచ్చేలా అధికారులకు ఆదేశాలిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు రావి తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడితో రావి



గుడివాడలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న విశ్వభారతి మేనేజింగ్ డైరెక్టర్ మంజుల



ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సంబరాల్లో మాట్లాడుతున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు





ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ స్కూల్‌లో గంగిరెద్దు ఆటలు, ముగ్గులు వేసి సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

గుడివాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : విశ్వభారతి హమ్మింగ్ బర్డ్స్‌లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంక్రాంతి ప్రాముఖ్యతను పాటలు, నృత్యాలు, ఉపన్యాసాల ద్వారా వివరించారు. వినాయకుడు, శివుడు, వేంకటేశ్వర స్వామి, గోదాదేవి, హరిదాసులు, బుడబుక్కల వేషాధారణతో, భోగి మంటలు, గాలిపటాల ఆటలతో సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. విశ్వభారతి విద్యా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్లూరి శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ జి.రాధ చిన్నారులకు భోగిపళ్ల పోశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విశ్వభారతి వైజ్‌వుడ్స్‌లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మన్నెం పద్మావతి జ్యోతి వెలిగించి సంబరాలను ప్రారంభించారు. గొబ్బిళ్లు, భోగిమంటలు, హరిదాసుల కీర్తనలు, జానపద, సాంఘిక, ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు, భగవద్గీత శ్లోక పఠనం, కోలాటాలతో ఉత్సాహంగా సంబరాలు సాగాయి. వైజ్‌వుడ్స్ సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, మేనేజింగ్ డైరెక్టర్లు ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, డీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో..

గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ముగ్గుల పోటీలు, వంటల పోటీలు, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ కార్వింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, కోలాటం పోటీలను నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ అండర్-35లో పి.నీలవేణి, జి.పావనివల్లి, ఎం.మీనాక్షి, 35 సంవత్సరాల పైబడిన పోటీల్లో పి.లీలాప్రియ, ఎస్.వెంకటలక్ష్మీ, ఎస్.వెంకట పద్మావతి విజేతలుగా నిలిచ్చారు. లెమన్ అండ్ స్పూన్ అండర్-35 విభాగంలో జె.కావ్య, ఆర్.పూర్ణిమ, కె.మెర్షిత, 35 సంవత్సరాల పైబడిన విభాగంలో ఎన్.శాంతి, ఎన్.అనసూయ, ఎస్.శ్రీలక్ష్మీ మొదటి మూడు స్థానాలు సాధించారు. వంటల పోటీ స్వీట్ విభాగంలో ఎ.లావణ్య, కె.సుభాషిణి, కె.మీనాక్షి, హాట్ విభాగంలో యం.డి మున్నీ, ఎస్.వెంకటలక్ష్మీ, కె.లక్ష్మీ దుర్గభవాని , ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ కార్వింగ్ విభాగంలో పి.గౌరీ సుధ, వి.పార్వతి, ఎస్.పద్మ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

గుడ్లవల్లేరులో..

ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు దండమూడి విజయలక్ష్మీ విచ్చేసి సంబరాలను ప్రారంభించి సందేశమిచ్చారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణ, నృత్యాలు, స్కిట్‌లు ఎంతో అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విశిష్ట అతిథి స్వచ్ఛంద సేవా సంఘం ఉపాధక్షులు సీతారామస్వామి , ప్రిన్సిపాల్ సాతులూరి లీనా, వైస్ ప్రిన్సిపాల్ సత్యబాబు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, దావులూరి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలి : ఎంపీడీవో

గుడివాడ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐదు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమైనందున ప్రాముఖ్యత గల పనులను చేపట్టాలన్నారు.



గుడ్లవల్లేరులో రమాసహిత సత్యనారాయణస్వామికి ముత్యాల హారతులు

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

గుడ్లవల్లేరు, జనవరి9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబయ్యాయి. గుడ్లవల్లేరు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కౌతవరం చెన్నకేశవాలయం, గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం, డోకిపర్రు భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శుక్రవారం ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాటు చేశారు.

సత్యనారాయణస్వామికి ముత్యాల హారతి


గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణ స్వామికి గురువారం ముత్యాల హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకస్వామి రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు స్వామి వారికి ముత్యాల హారతులద్దారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారు ఉత్తరద్వార దర్శన ఇవ్వనున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వందల సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం బారికేడ్లు నిర్మిస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

లక్ష గులాబీలతో స్వామికి అలంకరణ

గుడివాడ రూరల్ : దొండపాడు ఉమా గంగా సహిత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామి వారికి లక్ష గులాబీల అర్చన ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు పాలపర్తి ప్రేమ్‌చంద్ లక్ష గులాబీలతో స్వామివారికి పూజలు నిర్వహించారు.




దొండపాడు భక్తబృందం ఆధ్వర్యంలో దొండపాడు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలో వ్యక్తిగత బ్రాండింగ్ అవశ్యం

గుడివాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ యుగంలో వ్యక్తిగత బ్రాండ్ మేనేజ్‌మెంట్ చాలా ప్రాముఖ్యత కలిగి ఉందని కేఎల్ బిజినెస్ స్కూల్, విజయవాడ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మధులత అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు డిజిటల్ యుగంలో వ్యక్తిగత బ్రాండింగ్, ప్రాముఖ్యత అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచంలో అనేక బ్రాండెడ్ వస్తువులు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్రాండ్ గుర్తింపు, బ్రాండ్ నిర్వచనాలు, బ్రాండ్‌పై సామాజిక మాధ్యమాల ప్రభావం వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎం.బి సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు హెచ్‌ఎం ఫణి రాజమోహన్

తోట్లవల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.ఫణి రాజమోహన్ దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. ఫణి రాజమోహన్ గురువారం హైస్కూల్లో ఈ విష యాన్ని వెల్లడించారు. పోరంకిలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో విద్యార్థులు సులభంగా లెక్కలు నేర్చుకునే విధంగా రూపొందించిన మేథమెటికల్ టీచింగ్ ఎయిడ్స్ అంశం దక్షిణ భారత సైన్స్ ఫెయిర్స్‌కు ఎంపికైనట్లు చెప్పారు. పుదుచ్చేరిలో ఈ నెల 20 నుండి 25వ తేదీ వరకు సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీలు జరుగనున్నాయన్నారు. పోరంకి సైన్స్ ఫెయిర్‌లో తాను ప్రదర్శించిన ఎగ్జిబిట్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామారావు తిలకించి అభినందించడం అరుదైన గౌరవమని ఫణి రాజమోహన్ సంతోషం వ్యక్తం చేశారు.



తాను రూపొందించిన మేథమెటికల్ టీచింగ్ పత్రాలు, ట్రోఫీతో రాజమోహన్

అధికారులు తప్పక హాజరు కావాలి : వర్ల కుమార్‌రాజా

పెదపారుపూడి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులు సమావేశానికి రాకపోవటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. సర్పంచ్‌లకు, నాయకులకు ఎంపీడీవో సీతామహాలక్ష్మి గౌరవం ఇవ్వటం లేదని సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవోపై పలువురు సర్పంచ్‌లు ఫిర్యాదు చేస్తుండగా, ఆమె అక్కడి నుంచి వెళ్లిఎయారు. వైస్ ఎంపీపీలు పొనుగుమాటి రజని, వెలగల పద్మ, సర్పంచ్‌లు చప్పిడి సమీరా, వికృత స్వాతి, ప్రత్తిపాటి అశ్వత్థ నారాయణరావు, అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఇసుక కార్మికుల తీరు ఆక్షేపణీయం

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి

తోట్లవల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఇసుక కార్మికుడిని క్వారీల్లోకి అడుగుపెట్టనీయకుండా చేసి ఉపాధి దెబ్బతీస్తే, టీడీపీ ప్రభుత్వం వచ్చాక 2,500 మంది కార్మికులకు పని కల్పించి ప్రతి కార్మికుడు రోజుకి రూ.800 నుంచి రూ.1000 వరకు సంపాదించుకునే చేస్తే వైసీపీ నేతల కుట్రలు, కుతంత్రాలతో ధర్నా చేయటం గర్హనీయమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తోట్లవల్లూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నాయకత్వంలో వైసీపీ పాలనలో ఇసుకను యధేచ్ఛగా దోచుకున్నారని, కార్మికులను రోడ్డునపడేశారని విమర్శించారు. అలాంటి కైలే ఇపుడు ఇసుక కార్మికులను రెచ్చగొట్టి ధర్నా చేయించటం సిగ్గుచేటన్నారు. వైసీపీకి చెందిన ఇసుక కార్మికులు ఇటీవల తనను కలిసినపుడు కూడా క్వారీల సమస్య చెప్పలేదని, అధికారులకు చెప్పలేదని, ఎలాంటి ముందస్తు డిమాండ్ లేకుండా రోజంతా ధర్నా చేయటం వెనుక సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకాన్ని దెబ్బతీసే కుట్రలో భాగమేనని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉండగా తాము ధర్నా చేస్తే పోలీసులు అరగంటలోనే లేపేశారని, ఇపుడు సమస్య లేకున్నా కార్మికులు క్వారీని అడ్డుకుని రోజంతా ధర్నా చేస్తున్నా పోలీసులు, అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం కావటం లేదన్నారు. వల్లూరుపాలెం టీడీపీ నాయకుడు ఈడే వాసుపై కార్మికులు దాడి చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. దాడులు చేస్తే సహించేదిలేదని గురుమూర్తి హెచ్చరించారు.



హనుమంతపురంలో సిద్ధమవుతున్న బరి

చకచకా కోడిపందేల బరులు

పమిడిముక్కల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండలంలో సంక్రాంతి పండుగకు కోడి పందేల బరులను అధికార పార్టీ నాయకులు సిద్ధం చేస్తున్నారు. హనుమంతపురంలో ఐదు ఎకరాల మాగాణి పొలంలో రెండు బరిలు, కపిలేశ్వరపురం పరిధిలో ఆరు ఎకరాలకు పైగా పొలంలో బరుల ఏర్పాటుకు పనులు చకచకా జరుగుతున్నాయి. వీక్షకులకు గ్యాలరీలు, టెంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. టీ స్టాల్, బిర్యానీపాయింట్ల ఏర్పాటుకు నిర్వాహకుల వద్దకు క్యూ కడుతున్నారు.



కపిలేశ్వరపురంలో సిద్ధం చేస్తున్న బరి

సీపీఐ శత వార్షికోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గుడివాడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన పోరాటాలు చేస్తున్న సీపీఐ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అన్నారు. సీపీఐ కార్యాలయంలో శత వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక, కర్షక, పేదల పక్షాన పక్షపాతిగా నిలిచిన సీపీఐ శత వార్షికోత్సవాన్ని ప్రతి పట్టణం, పల్లెల్లో ఘనంగా ఏడాది పాట నిర్వహించాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, విద్యార్థి సంఘ నాయకులు సాదిక్, ఏఐటీయూసీ నాయకులు కె.వెంకన్న, జి.శేషు, జోజి, మురళీ, భూషయ్య పాల్గొన్నారు.



అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

పమిడిముక్కల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ సా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కపిలేశ్వపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తక్షణమనే తొలగించాలని, అమిత్‌షా క్షమాపణ చెప్పాలని పార్టీ నాయ కులు మొవ్వ మోహన్‌రావు, భుజంగనాయక్, నాగభూషనరావు, పాపారావు, సోమేశ్వరరావు తదితరులు డిమాండ్ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

గుడివాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చెంచుపేటలో బహిరంగ ప్రదేశంలో పేకాడుతున్న 10మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5400 స్వాధీనం చేసుకున్నట్లు ఒన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

50శాతం అర్జీలు పరిష్కారం : తహసీల్దార్

గుడివాడ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 240 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకోటేశ్వరరావు గురువారం తెలిపారు. మొత్తం అర్జీల్లో సగానికి పైగా పరిష్కరించటం జరిగిందన్నారు. రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులు చక్కగా నిర్వహించినందుకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

టీటీడీలో తొక్కిసలాటకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

గుడివాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలనివ వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో గురవారంవిలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యం, టీటీడీ బోర్డు అసమర్థత వలన తొక్కిసలాట జరగిందన్నారు. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన సంఘటనపై అధికారులుపై నెపం నెట్టి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.515

జిల్లా హాకీ జట్టు ఎంపిక

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సబ్ జూనియర్ హాకీ జట్టు ను ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రవణం హరికృష్ణ తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 17, 18, 19 తేదీల్లో మదనపల్లెలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటుందని హరికృష్ణ తెలిపారు.





వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికల కబడ్డీ పోటీలు



బహుమతి అందజేస్తున్న ఎస్పీ, కలెక్టర్, కొనకళ్ల, కాగిత, బాలాజీ



నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో వాలుజడ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



కొమ్మారెడ్డిలో బొమ్మల కొలువు వీక్షిస్తున్న ఎమ్మెల్యే కాగిత

సంస్కృతికి దర్పణం.. సంక్రాంతి సంబరాలు

మచిలీపట్నం టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతిని చాటే సంక్రాంతి సంబరాల్లో వీర్నాల ఫౌండేషన్ వివిధ పోటీలు నిర్వహించడం ముదావహమని కలెక్టర్ బాలాజీ అన్నారు. వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బహుమతులు అందజేశారు. వీర్నాల ఫౌండేషన్ అధినేత వీర్నాల బాలాజీ మాట్లాడుతూ, విద్యార్థులకు భవిష్యత్తులో రోబొటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన 3కే రన్ నిర్వహిస్తున్నామన్నారు. వీర్నాల బాలాజీ తండ్రి వీర్నాల నాంచారయ్య, మానస తదితరులు మాట్లాడారు. స్టార్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా, వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన చదరంగం పోటీలకు మంచి స్పందన లభించింది. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 756 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హిందూ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు.

నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో గురువారం వైభవంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. గాలిపటాలు ఎగురవేశారు. రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. పాల పొంగళ్లు, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు జరిగాయి. వాలు జడల పోటీలు నిర్వహించి ప్రిన్సిపాల్ సుందరరాం విజేతలకు బహుమతులు అందచేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షించారు.

ఎదురుమొండి జడ్పీలో..

నాగాయలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలు తెలుగు సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. ఎదురుమొండి జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో కన్నా జనార్ధనరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు వెంకట్రామ్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ కన్నా నాగరాజు, మెండు లక్ష్మణరావు, మాజీ మండవ బాలవర్ధిరావు, తలశిల వెంకట నరసింహారావు, కన్నా సుధా కీర్తన, సైకం నాగజ్యోతి, సైకం నాగబాబు, మోకా నాగ ప్రసాద్, బాబూరావు, నాయుడు మస్తానరావు, సైకం వెంకటేశ్వరరావు, నాయుడు వెంకట కృష్ణ, వైద్యులు డాక్టర్ కె.రాజేశ్వరరావు, డాక్టర్ పాతిమున్నీసా, ప్రధానోపాధ్యాయులు యువి.కోటేశ్వరరావు, ఎన్.యామిని, పంచాయతీ కార్యదర్శి కొండవీటి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మారెడ్డిలో హరిదాసు సంకీర్తనలు



కళాంజలి హైస్కూల్ సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

బంటుమిల్లి కొమ్మారెడ్డిలో..

బంటుమిల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిసంస్కృతి సంప్రదాయాల పట్ల ఆసక్తి అవగాహన కలిగి ఉండాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా బొమ్మల కొలువును ప్రారంభించి చిన్నారులకు భోగిపండ్లు పోశారు. రంగవల్లుల పోటీలు నిర్వహించారు. తెలుగమ్మాయి, తెలుగు అబ్బాయి వంటి పోటీలు నిర్వహించారు. రైతు బిడ్డ, పశువుల మేత కొరకు పచ్చగడ్డి మోసుకొస్తున్న రైతు, వరికోతలకు వస్తున్న రైతు, కోడి పందాలకు సిద్ధమైన తెలుగువాడు, గొర్రెల కాపరి, గంగిరెద్దుల ఆట, బుడబుక్కల, హరిదాసుడు, జంగందేవర, కర్రసాధనం, తెలుగు వంటలు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 మంది విద్యార్థులు పలు రకాల విచిత్ర వేషధారణలో పాల్గొన్నారు. కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రటరీ, కరస్పాండెంట్ కేఎస్‌విజి శోభ, యంగ్ డైరెక్టర్ హరిణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అవనిగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రభు (ప్రథమ), వెంకట్ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులు డప్పు కళను ప్రదర్శించారు. భోగిమంటలు వెలిగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భారతీయ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి తెలిపారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెడన కళాంజలి హైస్కూల్‌లో..

పెడన, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భోగిపండ్లు పోసి పిల్లలకు ఆశీస్సులు అందజేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఆర్. శివసాయిప్రసన్న, ఏ. హాసిని దుర్గ, పి. కుసుమ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వి. మల్లికకు ప్రోత్సాహక బహుమతి లభించింది. హైస్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ ప్రసన్నలక్ష్మి పర్యవేక్షించారు.



మహిళలు వేసిన ముగ్గులను తిలకిస్తున్న మండలి వెంకట్రామ్ తదితరులు



సంప్రదాయ వేషధారణలో కొమ్మారెడ్డి విద్యార్థులు



అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో పాలపొంగళ్లు

వైకుంఠ ఏకాదశికి ఆలయాల్లో ఏర్పాట్లు

అవనిగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గీతా మందిరం, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాలలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

ధర్మకర్త పోతరాజు హనుమంతరావు, కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) మాట్లాడుతూ భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. అర్చక స్వామి బృందావనం వేణుగోపాలాచార్యులు స్వామి వారిని అలంకరించి, ఉత్తర ద్వార దర్శనం చేయిస్తారన్నారు.

ముమ్మరంగా తూటుకాడ నిర్మూలన

అవనిగడ్డ రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడి, రామచంద్రపురం, మాచవరం గ్రామాల ఆయకట్టుకు సాగు, తాగునీటిని అందించే 1, 2, 3 పంట కాలువల్లో తూటుకాడ నిర్మూలన చర్యలు వేగంగా సాగుతున్నాయి. డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్ నేతృత్వంలో ఏఈ దోవారి విజయ్ కుమార్, సంఘ సభ్యులు పనులను పర్యవేక్షిస్తున్నారు





క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న హసీంబేగ్

క్రీడాసక్తి పెంపొందించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు విద్యార్థులో క్రీడాసక్తిని పెంపొందింప చేయాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ అన్నారు. బచ్చుపేటలో గురువారం స్టార్ విద్యా సంస్థల క్రీడా హబ్‌ను హసీంబేగ్ ప్రారంభించారు. క్రికెట్ కోర్టు, టెన్నీకాయిట్ కోర్టు, ఖోఖో, రింగ్, కబడ్డీ కోర్టులను అతిథులు టౌన్‌హాలు మాజీ అధ్యక్షుడు చిన్నం శివ, బొమ్మిడి గణేష్, స్టార్ విద్యా సంస్థల అకడమిక్ మెంటార్ శ్రీరామ్, డైరెక్టర్ అయ్యప్ప స్వామి, ప్రిన్సిపాల్ గౌసియా, ఆదిత్య అడపా రత్నాకర్, మాజీ కౌన్సిలర్ లోగిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని నగర కమిషనర్ బాపిరాజు అన్నారు. ఆకస్మిక తనిఖీలలో భాగంగా గురువారం 45వ డివిజన్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, డివిజన్ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, సచివాలయ సిబ్బందితో కలసి సమస్యలను తెలుసుకుంటూ డివిజన్‌లో పర్యటించారు. మంచినీటి లీకేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి. ఫణికుమార్, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంజాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి కొనకళ్ల భాను, మూడో డివిజన్ ఇన్‌చార్జి చిన్నం సురేష్, 50వ డివిజన్ ఇన్‌చార్జి పడమట నాగరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు గ్రామానికి చెందిన పడమటి నాగముని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంత్యక్రియలు గురువారం మల్లవోలు గ్రామంలో జరిగాయి. నాగముని అంత్యక్రియల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5వేల సాయం అందజేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహనత్రినాథ్, ప్రత్తిపాటి కోటేశ్వరరావు, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, వీడే అర్జునరావు, శ్రీనివాసరావు, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

నాగాయలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పంచాయతీలు సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని సీనియర్ కన్సల్టెంటు ఏడుకొండలు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం జరిగింది. పంచాయతీలను సుస్థిరమైన ప్రగతిలో నడిపించేందుకు ఏయే అవసరాలు కావాలో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి నివేదికలు తయారు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పి.అప్పల నరసయ్య పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నం రాజుపేటలోని 37, 38, 39 డివిజన్లలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ట్రూ అప్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి దారిన కరెంటు ఛార్జీలను పెంచి ప్రజల మీద భారం మోపిందన్నారు. సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, టి. చంద్రపాల్, సిహెచ్. జయరావు, ఎండి యూనస్, కొడాలి సుజాత, ఐద్వా పట్టణ కమిటీ అధ్యక్షురాలు సిహెచ్. విజయలక్ష్మి, సభ్యులు బూర భవానీ, నాయకులు ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.

తుంగపల్లెమ్మ ఆలయంలో చోరీ

కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మాచవరం గ్రామంలోని తుంగపల్లెమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం రాత్రి దొంగలు పగలకొట్టి కానుకలు చోరీ చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు కూరాకుల శివయ్య కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను కూడా దుండగులు అపహరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మచిలీపట్నం క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నట్లు అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు.

ప్రభుదాస్‌కు వెంకట్రామ్ నివాళి

కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : రామకృష్ణాపురం మాజీ సర్పంచ్ అద్దంకి పాండురంగారావు సోదరుడు అద్దంకి ప్రభుదాస్ (45) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. గురువారం జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, తూర్పు కృష్ణ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రభుదాస్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాలువ చివర భూములకు సాగునీరందిస్తాం

నాగాయలంక, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాల్వ చివర భూములకు సాగునీరందిస్తామని నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లేశ్వరరావు అన్నారు. మర్రిపాలెం జలవనరుల శాఖ కార్యాలయంలో గురువారం డీసీ సమావేశం జరిగింది. ఏఈ పి.రవితేజ అధ్యక్షత వహించారు. నాగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇరిగేషన్, డ్రైనేజీ అధికారులు, నీటి సంఘాలు సమన్వయంతో రైతులకు సాగునీరును అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఇరిగేషన్ డీఈఈ పి.వెంకటేశ్వరరావు, డ్రైనేజీ డీఈఈ జె.బాబూ నాయక్, ఏఈ పి.చిరంజీవి, ఉపాధ్యక్షుడు కె.నరసింహరావు, నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పెడనలో ఆక్రమణల తొలగింపు

పెడన, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చేపల మార్కెట్ ప్రాంతంలో ప్రధాన రహదారి పక్కన గల ఆక్రమణలను మునిసిపల్ అధికారులు గురువారం తొలగించారు. అక్రమ కట్టడాల వల్ల వర్షపు నీరు డ్రెయిన్‌లోకి వెళ్లడం లేదు. ప్రధాన రహదారి పక్కన గల ఆక్రమణలు తొలగించాలని ప్రజలు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు గురువారం ఆక్రమణలు తొలగించారు. టీపీవో సుజనకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, ప్లానింగ్ సెక్రటరీ కిరణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు రిక్షాలు అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే మండలి

గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలి

అవనిగడ్డ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీలు కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. అవనిగడ్డ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య రిక్షాలను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి ప్రారంభించి కార్మికులకు అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, కూటమి పార్టీల నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే కనకదుర్గ, మోర్ల రాంబాబు, పైడిపాముల కృష్ణకుమారి, మెండు లక్ష్మణరావు, బచ్చు రఘునాథ ప్రసాద్, మాచవరపు ఆదినారాయణ, బచ్చు కృష్ణకుమారి, శోభిల ఏడుకొండలు, బాదర్ల లోలాక్షుడు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ అరుణకుమారి, కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.



మృతుని భార్య యమునకు రూ.50,500 అందజేస్తున్న శంకరాచారి, శివనాగేశ్వరరావు

నాగ విజయ్‌బాబు మృతితో పెదప్రోలులో విషాదం

చల్లపల్లి - మోపిదేవి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : శబరిమల యాత్రలో గుండెపోటులో మృతిచెందిన ఆకుల నాగ విజయ్‌బాబు భౌతికకాయాన్ని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ సంస్థ ఆధ్వర్యంలో స్వగ్రామం పెదప్రోలుకు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగ విజయబాబు మృతితో స్వగ్రామం పెదప్రోలు తీవ్ర విషాదం నెలకొంది. తల్లిదండ్రులు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్న విజయ్‌బాబు చిన్నవయసులోనే ఈలోకాన్ని వీడటంతో ఆ ఇంట చీకట్లు అలుముకున్నాయి. అయ్యప్ప ధర్మప్రచార సభ సంస్థ సహకారంతో రూ.50,500 అంబులెన్స్ ఖర్చులు, అంత్యక్రియల నిమిత్తం మృతుడి భార్య యమునకు అందజేశారు. అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి, ఉపాధ్యక్షులు ముసంగి శివనాగేశ్వరరావు, జిల్లా సభ్యులు కలపాల ప్రసాద్, ప్రచారసభ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వహణ చట్టరీత్యా నేరం

ఘంటసాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేల నిర్వహణ చట్టరీత్యా నేరమని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, ఎస్సై ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కోడిపందాలు, పేకాటను నివారించేందుకు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారి మనోజ్, పంచాయతీ కార్యదర్శులు, కానిస్టేబుళ్లు, వీఆర్వోలు రులు పాల్గొన్నారు.